'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# న్యాయ సమస్యలు

**న్యాయం** చేయడం ఆలస్యమైతే అన్యాయం చేసినట్టే అనేది పెద్దల మాట. ఓ విచారణ ఖైదీ తన కేసు కోర్టు ముందుకు రావడానికే పదేండ్ల కాలం ఎదురుచూడాలా? ముదివగ్గులు తమ ఆస్తి తగాదాల పరిష్కారానికి 30-40 ఏండ్లు ఓపిక పట్టగలరా? మన దేశంలో న్యాయవ్యవస్థ ఎదుర్కొనే అతిపెద్ద సమస్య పెండింగ్ కేసులు. 'న్యాయవ్యవస్థ స్థితిగతులు' అనే శీర్షికతో సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని పరిశోధన, ప్రణాళిక కేంద్రం ఇటీవల వెలువరించిన ప్రత్యేక నివేదిక దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. పెండింగ్ కేసులు గుట్టలుగా పేరుకుపోవడం వెనుక గల కారణాలను కొంత మేర విశ్లేషించింది.

దేశంలోని వివిధ కోర్టుల్లో 2023 అక్టోబర్ నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్ల పై చిలుకే. మూడంచెల న్యాయవ్యవస్థలోని సుమారు 20,580 మంది న్యాయమూర్తులు వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. హైకోర్టు జడ్జి స్థానాల్లో 30 శాతం, జిల్లా జడ్జి పోస్టుల్లో 20 శాతం ఖాళీగా ఉన్నాయి. కేసుల సంఖ్యకు, జడ్జిల సంఖ్యకు మధ్యన పొంతన లేకపోగా అందులో భారీస్థాయిలో ఖాళీలున్నాయని దీనిద్వారా స్పష్టమవుతున్నది. జనాభా ప్రాతిపదికన జడ్జిల సంఖ్యను పెంచాలని వచ్చిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు 2002లో సమర్థించింది. కేసుల సంఖ్యను బట్టి జడ్జిలను నియమించాలని 2014లో లా కమిషన్ సూచించింది. ఇలా వేర్వేరు కమిటీలు కొత్త కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తూనే ఉన్నాయి. ఖాళీల భర్తీలో జరిగే జాప్యం మరో సమస్య. దేశంలో కేవలం 9 రాష్ర్టాలు మాత్రమే నిర్దేశిత సమయంలో భర్తీలు పూర్తి చేయగలుగుతున్నాయని సుప్రీంకోర్టు జరిపించిన అధ్యయనంలో వెల్లడైంది.

ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశంలో జనాభా-జడ్జి నిష్పత్తి అట్టడుగుస్థాయిలో ఉన్నది. అత్యధిక జనాభా కలిగిన చైనాలో 10 లక్షల జనాభాకు 300 మంది జడ్జిల చొప్పున ఉన్నారు. అదే అమెరికాలో 150 మంది ఉన్నారు. మన దేశంలో పది లక్షల జనాభాకు కేవలం 20-21 మంది జడ్జిలున్నారు. మన దేశంలో పెండింగ్ కేసులను బట్టి చూస్తే జడ్జిల సంఖ్య చాలా చాలా పెంచాల్సి ఉందనేది నిర్వివాదాంశం. ఇక న్యాయ నియామకాల విషయంలోనూ ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతి ఉంటుంది. మౌలికంగా చూస్తే రాజకీయ, రాజకీయేతర నియామకాలుంటాయని చెప్పాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన బ్రిటన్‌లో న్యాయ నియామకాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జ్యుడిషియల్ కమిషన్ అజమాయిషీలో స్వేచ్ఛగా జరుగుతాయి. పార్టీ రాజకీయాలకు ఈ నియామకాల్లో ఏ మాత్రం ప్రమేయం ఉండదు. కాగా అమెరికాలో న్యాయ నియామకాలు ప్రభుత్వాధినేతల కనుసన్నల్లో జరుగుతాయి. మన దేశంలో ఉన్నత న్యాయస్థానాల ఖాళీల భర్తీలు, బదిలీలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై సర్వోన్నత న్యాయస్థానానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నియామకాలు న్యాయ పర్యవేక్షణలో కాకుండా ప్రభుత్వ అజమాయిషీ కింద జరిగేలా చూసేందుకు కేంద్రం తలపెట్టిన న్యాయ నియామకాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. తదనంతర కాలంలో కొలీజియం సిఫారసులపై జాప్యం జరుగుతుండటంతో కొంత అస్థిరత నెలకొంటుండటం చూస్తున్నాం. మన దేశంలో ఒక అంచనా ప్రకారం.. సగటున ఒక కేసు విచారణకు హైకోర్టుల్లో మూడేండ్ల ఒక నెల పడుతుంది. అదే జిల్లా కోర్టుల్లోనైతే ఆరేండ్లు పడుతుంది. అమెరికాతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాల్లో 6 నెలల నుంచి సంవత్సరం కాలంలో కేసు పరిష్కారమవుతుంది. మనం ఆ స్థాయిని అందుకోవడం ప్రస్తుతానికైతే దాదాపు అసాధ్యమనే చెప్పాలి.


న్యాయ నియామకాల్లో జాప్యంతో పాటుగా పదే పదే దృష్టికి వచ్చే మరో సమస్య సామాజిక సమగ్ర ప్రాతినిధ్యం. విస్తృత సామాజిక, భౌగోళిక, మతపరమైన వైవిధ్యం కలిగిన దేశం మనది. ఆ సమగ్రత న్యాయ నియామకాల్లో ప్రతిఫలిస్తేనే ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. మహిళా జడ్జిల సంఖ్యతో పాటుగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని కూడా నివేదిక విశ్లేషించింది. జడ్జిల నియామకాల్లో సామాజిక వర్గాల వారీగా ప్రాతినిధ్యం గురించిన లెక్కలను ఇటీవల కేంద్ర న్యాయశాఖ పార్లమెంటుకు సమర్పించింది. హైకోర్టు జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు 25 శాతం, సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తులు కేవలం ముగ్గురు (8.85 శాతం) మాత్రమే ఉండటం ఆలోచించాల్సిన విషయమే. అయితే హైకోర్టుల్లో ఈ సంఖ్య కాస్త మెరుగ్గా 14.1 శాతంగా ఉన్నది. మన ఉన్నత న్యాయస్థానాల్లో సామాజికవర్గాల వారీగా నియామకాలు జరుగవనేది తెలిసిందే. కేసులకు తగ్గట్టుగా న్యాయమూర్తుల పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేయడం, మహిళా ప్రాతినిధ్యం, సామాజిక ప్రాతినిధ్యం తగిన స్థాయిలో కల్పించడం జరిగితే, సకాలంలో న్యాయం జరుగుతుందన్న భరోసా ప్రజలకు ఏర్పడుతుందని చెప్పవచ్చు.

## కశ్మీర్‌పై చర్చలెక్కడ?



*'మన స్నేహితులను మనం మార్చుకోగలం కానీ, పొరుగు వారిని మార్చలేం' అని మాజీ ప్రధాని వాజపేయి చెప్పేవారు. జమ్మూకశ్మీర్ సమస్య చర్చల ద్వారానే పరిష్కారమవుతుందని గతంలో ప్రధాని మోదీ కూడా చెప్పారు. భారత్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నామని నవాజ్ షరీఫ్ సంకేతాలిస్తున్నారు. కానీ, మనవైపు నుంచి ఎటువంటి స్పందన లేదు. కశ్మీర్ సమస్య పరిష్కారం కాకపోతే, గాజాకు పట్టిన గతే జమ్మూకశ్మీర్‌కు పడుతుంది.*

**- ఫరూక్ అబ్దుల్లా,** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి




# హామీల అమలులో సమస్యలు 'గ్యారెంటీ'

**బీఆర్ఎస్ అమలుచేసిన సంక్షేమ పథకాల కంటే ఒక మెట్టుపైనే ఉండాలన్న ఉబలాటంతో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల తాయిలాలతో ఓటర్లను ఆకర్షించింది. అయినప్పటికీ సుమారు 2 శాతం ఓట్ల మెజారిటీతోనే గద్దెనెక్కింది. వెంటనే మహాలక్ష్మీ పథకంలో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారు. మిగతా గ్యారెంటీల అమలు కోసం వందరోజుల సమయాన్ని కోరారు. కానీ ఈ పథకాల అమలు తీరుతెన్నులు నిరాశాజనకంగానే ఉండబోతాయనే సంకేతాలు వెలువడుతున్నాయి.**



డాక్టర్ వి.వి.రామారావు
98492 37663



తొలుత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. ఇంకేముంది ఆర్టీసీ బస్సులన్నీ మహిళలతో కిక్కిరిసిపోయాయి. పురుషులు విధిలేక తమ సీట్లను మహిళలకు ఇచ్చి గౌరవంగా బస్సులు దిగిపోయారు. ఆటోలన్నీ బిక్కపోయాయి. ఇప్పుడు లబ్ధిదారులు కానివారికి మాత్రం మెరమెరగా ఉన్నది. కానీ ఏం చేస్తారు పాపం! ఖాళీ బస్సులు వచ్చే దాకా ఎదురుచూడటం తప్పు! ఒకప్పుడు 'మహిళలకు ప్రత్యేకం' అని బోర్డు ఉండేది. కానీ, ఇప్పుడు 'పురుషులకు ప్రత్యేకం' కావాలంటూ అర్జీలు పెట్టుకొనే పరిస్థితి వచ్చింది.

వాస్తవానికి మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ పథకం వల్ల ఒరిగిందేమీ లేదు. పైగా ఈ పథకం పట్టణాల్లోని ఆటో డ్రైవర్ల పొట్టకొట్టింది. లక్షల రూపాయల వేతనాలు ఆర్జించే వేలాది ఉద్యోగినులు సైతం ఉచితమే కదా అని దర్జాగా బస్సుల్లో ప్రయాణిస్తుండటం గమనార్హం. ఈ ఉచిత పథకం వల్ల ఆర్టీసీకి రూ.3000 కోట్ల పైచిలుకు నష్టమవుతుండగా ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించనున్నది. జీరో టికెట్ ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక అందజేసి అందుకు సంబంధించిన నగదును తిరిగి ఆర్టీసీ పొందనున్నది. అంటే కుడిచేత్తో సంపాదించింది ఎడమ చేత్తో ఖర్చుచేయడమన్న మాట. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 'సంపదను సృష్టిస్తాం' అని అన్నారు. ప్రభుత్వ నిధులను ప్రభుత్వ సంస్థకు ఇవ్వడమే సంపద సృష్టించడమా? అన్నది అసలు ప్రశ్న.

వాస్తవానికి ఎన్నికల ప్రచార సమయంలో మహిళలెవరూ ఉచిత బస్సు ప్రయాణం కావాలని డిమాండ్ చేయలేదు. పేద మహిళలు తమ కుటుంబానికి ఏదైనా ఉపాధి కల్పించాలని, కూడు, గూడు, గుడ్డ తదితర మౌలిక వసతులు సమకూర్చాలని ఓట్ల కోసం వెళ్లిన ప్రతి పార్టీని, నాయకుల ముందు ప్రాధేయపడ్డారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు. మొత్తంగా ఉచిత బస్సు ప్రయాణ పథకం కాకులను కొట్టి, గద్దలకు పెట్టిన చందంగా ఉన్నదనడంలో సంశయం లేదు. ఇప్పుడు పల్లెటూర్లకు వెళ్తే మనకొకటే దృశ్యం కనిపిస్తున్నది. పనులను వదులుకొని మరీ మహిళలు సమీప పట్టణాలకు 'ఫ్రీ' బస్సులో పయనమవుతున్నారు. తద్వారా ఉచిత బస్సు ప్రయాణం ప్రభావం ఉత్పాదకతపై కూడా పడుతుందని చెప్పవచ్చు. అంతిమంగా ఖర్చు తడిసి మోపెడై ఈ పథకం కొన్నేండ్లకు తెల్ల ఏనుగవుతుంది.

ఇక రెండవది మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్ ఇస్తామని ప్రకటించడం. తెలంగాణలో మొత్తం 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా హెచ్‌పీసీఎల్ నుంచి నుంచి 43.40 లక్షలు, ఐవోసీఎల్ నుంచి 47.97 లక్షలు, బీపీసీఎల్ నుంచి 29.04 లక్షల వినియోగదారులున్నారు. వీరిలో 44 శాతం మంది అంటే 52.80 లక్షల మంది ప్రతి నెలా సిలిండర్ బుక్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.955 కాగా, సాధారణ కనెక్షన్లకు ఒక్కో బుకింగ్‌కు కేంద్రం రూ.40 రాయితీ అందిస్తున్నది. ఉజ్వల కనెక్షన్లకు రూ.340 రాయితీ వస్తున్నది. తెలంగాణలో మొత్తం 11.58 లక్షల ఉజ్వల కనెక్షన్లు ఉండగా, కేంద్రం విజ్ఞప్తి మేరకు 'గివ్ ఇట్ అప్'లో భాగంగా రాష్ట్రంలో 4.2 లక్షల మంది రాయితీ వదులుకున్నారు. ఈ పథకం కింద ఏటా ప్రతి లబ్ధిదారునికి 6 గ్యాస్ సిలిండర్లు ఇస్తే ప్రభుత్వంపై దాదాపు రూ.2,225 కోట్ల భారం పడుతుందని అధికారుల అంచనా. అదే 12 సిలిండర్లు ఇస్తే ఆ భారం రెట్టింపవుతుంది.

**ప్రతి పేద మహిళకు నెలకు రూ.2500 భృతి ఇచ్చే పథకానికి ఇంకా మార్గదర్శకాలు జారీ కాలేదు. 1.5 కోట్ల మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అవకాశాలున్నాయి. దీంతో ప్రభుత్వంపై ప్రతి నెల దాదాపు రూ.3,750 కోట్ల భారం పడనున్నది. ఇప్పటికే రూ.5.8 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి ఇది అదనపు భారమే. ఒక్క మహాలక్ష్మి పథకానికే రూ.10,000 కోట్ల నిధులు అవసరమవుతాయి.**

బీఆర్ఎస్ రైతుబంధు పథకాన్ని ప్రారంభించిన నాటినుంచి ఠంచన్‌గా రైతులకు పెట్టుబడి సాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరును 'రైతుభరోసా'గా మార్చి ఎకరానికి రూ.10,000 సాయాన్ని రూ.15,000లకు పెంచింది. అయితే నిధుల లేమి కారణంగా ప్రస్తుత సీజన్‌లో పాత పద్ధతినే కొనసాగించింది. రైతు భరోసా విధి విధానాలు రూపుదిద్దుకోకపోవడమేనని ఏలినవారి ఉవాచ! కానీ, ఇంతవరకు ఒక ఎకరం భూమి ఉన్న రైతులకు మాత్రమే నిధులు విడుదల చేసింది. ఇదేమిటని ప్రశ్నిస్తే 'గత ప్రభుత్వం అప్పులు చేసింది. ప్రజలకు మేలు చేద్దామనుకుంటే ఖజానాలో ఒక్క పైసా లేదు' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఇలా ప్రకటించడం దేనికి సంకేతం? ఆరు గ్యారెంటీల్లో రెండు పథకాల్లోని కొంత భాగానికే కండ్లు తేలేయడాన్ని బట్టి చూస్తే మిగతా నాలుగు పథకాలను వంద రోజుల్లో అమలుచేయలేరనే అర్థమవుతున్నది. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 39 లక్షల మంది రైతులు.. బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణగ్రహీతలుగా ఉన్నట్టు నివేదికల ద్వారా తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్ల వరకు బ్యాంకుల్లో రైతు రుణాలున్నట్టు అధికారులు తేల్చారు. రూ.2 లక్షల వరకు పరిధి విధిస్తే రూ.32 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయి.

ప్రతి విద్యార్థినికి స్కూటీ ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఇవన్నీ అవసరమా? ఆచరణ సాధ్యమా? ఈ నిధుల కోసం ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి అప్పులు చేయకుండా సంపదను ఎలా సృష్టిస్తుందో ముఖ్యమంత్రి ఇంతవరకు చెప్పలేదు. ఎన్టీఆర్ హయాం కంటే ముందు భూమి శిస్తు, నీటితీరువా తదితర పన్నులుండేవి. 1983 నుంచి ప్రజాకర్షక పథకాలు వెల్లువలా ఉప్పొంగడం వల్ల ఉచితాల సంఖ్య పెరిగిపోయింది. నేడు భూమి శిస్తు లేదు. నీటి తీరువా పన్ను లేదు. వీటికి అదనంగా ఇప్పుడు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చే పథకం కూడా చేరింది. దీంతో సామాన్యుడిలో పలు ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతున్నాయి.

ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు, పింఛన్లు చెల్లిస్తారా? బాకీ పడిన నాలుగు విడతల డీఏ తక్షణమే చెల్లిస్తారా? పదవీ విరమణ వయస్సును 61 ఏండ్ల నుంచి 58 ఏండ్లకు తగ్గిస్తారా? రాహుల్‌గాంధీ ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తారు? అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. యూపీఎస్సీ తరహాలోనే టీఎస్‌పీఎస్సీలో మార్పుచేర్పులు చేస్తామని వాగ్దానం చేశారు. యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల సహాయం చేస్తామన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ మార్పులో నిరుద్యోగులు కీలకంగా వ్యవహరించారు. సీఎం రేవంత్‌రెడ్డి వరుస సమీక్షలు నిర్వహిస్తున్నా.. టీఎస్‌పీఎస్సీ విషయంలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. గ్రూప్-2 పరీక్షకు పట్టుమని పదిరోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో షెడ్యూల్డ్ ప్రకారమే జరుగుతుందా? లేదా తొలుత ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తుందా? అనేదానిపై స్పష్టత లేదు. ఒకవేళ జాబ్ క్యాలెండర్ మేరకు సర్కారు ముందుకెళ్తే ఫిబ్రవరి దాకా ఆగాల్సిందే! ఆ లోగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్డ్ వస్తే మళ్లీ కథ మొదటికే వస్తుందన్న నిరుద్యోగుల ఆందోళనను పాలకులు అర్థం చేసుకోవాలి.

**వంద రోజులు ఆగాలని కాంగ్రెస్ సర్కారు అంటున్నా.. వందరోజులు కాదు కదా, వెయ్యి రోజులైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఆ హామీల అమలు సాధ్యం కాదు. సాధ్యం కానీ పరిస్థితుల్లో తమ చేతగాని తనానికి 'చేతు'లెత్తి, దీనికి గత ప్రభుత్వ అప్పులే కారణమని చెప్తే ప్రజలు ఊరుకొంటారా? (ఆ.. ఊరుకోక ఏం జేస్తారు. ఐదేండ్ల దాకా ఏం చేయలేరనేది పాలకుల భావన.)**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎక్కువ శాతం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, విద్యుత్తు కొనుగోలు కోసమే కానీ, ఉచితాల కోసం కాదు. ఉమ్మడి ఏపీలో ఆఖరి ప్రభుత్వం కాంగ్రెస్‌దే. వారు గద్దె దిగుతూ కొత్త రాష్ర్టానికి 2500 మెగావాట్ల లోటును అప్పజెప్పిపోయారు. మిగతా రంగాల్లోనూ ఇదే పరిస్థితి. కానీ గత పదేండ్లలో శాసనసభ సమావేశాల్లో కేసీఆర్ ఎన్నడూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టలేదు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన ప్రజెంటేషన్‌ను నిశ్శబ్దంగా వీక్షించారే కానీ, ఎవ్వరూ అభ్యంతరాలు, సందేహాలు లేవనెత్తలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హడావుడిగా సమర్పించిన శ్వేత పత్రం మాత్రం గణాంకాల గారడీ పత్రమే! ఎందుకంటే తెలంగాణ వార్షిక బడ్జెట్‌లో ఆరు వేల కోట్ల లోటుందని తెలిసి సైతం ఎన్నికల ముందు, కాంగ్రెస్ తమ ఆర్థికవ్యూహాన్ని ప్రకటించలేదు.

పీవీ నరసింహారావు ప్రధాని అయ్యే సమయానికి మన దేశం బిచ్చమెత్తుకొనే దశలో ఉన్నది. పలు ఆర్థికసంస్కరణలు చేపట్టి ఐదేండ్లలోనే భారత్‌ను అగ్రరాజ్యాల సరసన నిలిపారు. అంతేకానీ గత ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగట్టలేదు. అది ఆయన సంస్కారం. పీవీ స్ఫూర్తిని కలలో కూడా తీసుకోలేని కాంగ్రెస్ అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో మన తెలంగాణ రాష్ర్టాన్ని పెనం మీది నుంచి పొయ్యిలో పడేసే సంకేతాలు కనిపిస్తున్నాయి. మార్పును ఆశించి తీర్పునిచ్చిన ప్రజలకు తాము చేసిన తొందరపాటు తప్పిదమేదో వంద రోజుల తర్వాత తెలుస్తుంది. ఉదాహరణకు ఎన్నికల ప్రచారంలో మహాలక్ష్మి పథకం గురించి ప్రతి మహిళ సంబురపడింది. తీరా చూస్తే తెల్లకార్డు ఉన్నవారికే ఆరు గ్యారంటీలంటూ కలెక్టర్ల మీటింగ్‌లో ముఖ్యమంత్రి తేటతెల్లం చేశారు.

**తెలంగాణలో దాదాపు 88 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నట్టు సమాచారం. తెల్లకార్డులు లేని వారు కండ్లు తేలేస్తున్నారు. ఆరు గ్యారెంటీల పథకాల ఫలాల కోసం ఇప్పుడు అందరు తెల్లకార్డుల కోసం కార్యాలయాల ముందు క్యూ కడుతున్నారు. ప్రచారంలో అందరికీ లాభం అని ధ్వనించేలా మాట్లాడి, ప్రస్తుతం కొందరికే అని ప్రకటించి మాట మార్చారు కాంగ్రెస్ నాయకులు.**

ఇదెలా ఉన్నదంటే మొదలు అందరినీ విందుకు ఆహ్వానించి, తర్వాత కొందరికి వడ్డించి, చివరికి మిగిలిన వారందరికీ మంచినీళ్లు ఇచ్చి పంపించే విధానం అని ప్రస్ఫుటమవుతున్నది. ఇలాంటి యూటర్న్‌లు, మెలికలు, మలుపులు రాబోయేరోజుల్లో ఎన్నో ఉంటాయని చెప్పడానికి మహాలక్ష్మి ఒక మచ్చుతునక. చెడి చింతించిన కార్యహాని కదా! అడుగు వేసేముందు ఆలోచించాలంటారు. కానీ, అడుగువేసిన తర్వాతే కాంగ్రెస్ ఆలోచిస్తుందని ప్రస్తుత పదిహేను రోజుల ఆ పార్టీ పాలన తీరుతెన్నులు తెలియజేస్తున్నది.

**(వ్యాసకర్త: సాహిత్య, రాజకీయ విశ్లేషకుడు)**

# భారతీయ పరిమళం విశ్వవ్యాప్తం

**కొవిడ్ మహమ్మారి మానవాళికి ఎన్నో పాఠాలు నేర్పింది. కరోనా నేర్పిన గుణపాఠం ప్రజల్లో చాలా మార్పులు తీసుకువచ్చింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రజలు సేంద్రియ ఉత్పత్తులను వాడేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగైన పూలతో సహజసిద్ధంగా తయారయ్యే సుగంధ పరిమళాలకు కూడా గిరాకీ పెరగడంతో 'ది ఫెర్ఫ్యూమ్ సిటీ ఆఫ్ ఇండియా'గా పేరొందిన కనౌజ్ వెలుగొందుతున్నది.**

గతంలో కళ తప్పిన మన దేశంలోని అత్తరు పరిశ్రమ ప్రస్తుతం కళకళలాడుతున్నది. కొవిడ్ తర్వాత మారిన ప్రజల అలవాట్ల కారణంగా ఇప్పుడిప్పుడే ఆ పరిశ్రమ పుంజుకుంటున్నది. మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన యువత ఈ పరిశ్రమకు ఊపిరులూదారు. తద్వారా శతాబ్దాల నాటి కళను బతికించడమే కాకుండా అనేకమంది ఉపాధికి మార్గం సుగమం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌ల సంస్కృతి అత్తరు పరిశ్రమకు పాకింది. తద్వారా బూండ్ ఫ్రాగ్రెన్సెస్, కస్తూర్, నాసో ప్రాప్యూమి తదితర స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. ఈ స్టార్టప్‌లలో అత్యధికం మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నవే.



**మన దేశంలో సుగంధ పరిమళాలు, రుచికి సంబంధించిన పరిశ్రమల ద్వారా ఏటా జరుగుతున్న వ్యాపారం సుమారు రూ.10 వేల కోట్లపైనే. అత్తరు, సువాసనలు, సుగంధ పరిమళాలల్లో వినియోగించే నూనెల వాటా ఇందులో సగంపైనే ఉంటుంది. ఈ రంగంలో ప్రపంచ మార్కెట్‌లో భారత్ వాటా సుమారు 10 శాతం. రానున్న ఐదేండ్లలో అత్తరు పరిశ్రమ మరింత వృద్ధిని సాధిస్తుందని మార్కెట్ రిసెర్చ్ సంస్థ టెక్నావియో అంచనా వేసింది. టెక్నావియో ప్రకారం.. ఏటా 15 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నది.**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కనౌజ్ నగరం సహజ సిద్ధమైన సుగంధ పరిమళాల పరిశ్రమకు ప్రసిద్ధి. శతాబ్దాల కిందటే కనౌజ్‌లోని వేల కుటుంబాలు అత్తరు తయారీలో నైపుణ్యం సాధించారు. డెగ్-భక్పా అనే ప్రాచీన పద్ధతిలో తయారుచేసే అత్తరుకు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉన్నది. మొఘలుల కాలంలో అత్తరు తయారీ ప్రారంభమైందని, అప్పటినుంచే కనౌజ్ అత్తరు పరిశ్రమకు ప్రసిద్ధి గాంచిందని పలువురు నిపుణులు చెప్తుంటారు. అయితే కొంతమంది చరిత్రకారులు ఈ వాదనను ఖండిస్తున్నారు. మొఘలులు మన దేశానికి రాకముందు నుంచే అత్తరు పరిశ్రమ మన దేశంలో ఉన్నదని చరిత్రకారులు అంటున్నారు. సింధూ లోయలో జరిపిన తవ్వకాల్లో సుగంధ పరిమళాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించడం వారి వాదనకు బలం చేకూరుస్తున్నది.

1980ల్లో తీసుకొచ్చిన సంస్కరణల ధాటికి దేశంలోని అత్తరు పరిశ్రమ కుదేలైంది. పశ్చిమ దేశాల నుంచి చౌకైన అత్తరు రాకతో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. 1990ల్లో కనౌజ్ పరిసర ప్రాంతాల్లో సుమారు 700 పరిశ్రమలుండేవి. 2000ల నాటికి ఆ సంఖ్య 150-200కు పడిపోయింది. చౌకైన సింథటిక్, ఆల్కహాల్ ఆధారిత సుగంధ పరిమళాల కారణంగా అక్కడి పరిశ్రమలు పోటీలో వెనుకబడ్డాయి. అతి ఖరీదైన శాండల్‌వుడ్ (చందనం) నూనెలను వినియోగించడం వల్ల స్వదేశీ అత్తరు ధరలు భారీగా ఉండేవి. అదే సమయంలో పశ్చిమదేశాల సుగంధ పరిమళాలు అతిచౌకగా లభించేవి. పోటీని తట్టుకునేందుకు స్వదేశీ పరిశ్రమలు కూడా ఆల్కహాల్‌ను వాడటం ప్రారంభించడంతో ఈ కళ అంతరించే దశకు చేరుకున్నది.

కొవిడ్ కారణంగా కొత్తకొత్త రంగాల్లో అడుగుపెడుతున్న యువత.. దీనిపై కూడా దృష్టిసారించింది. దేశంలోని చేతివృత్తిదారులు, మారుతున్న వినియోగదారుల సంస్కృతికి మధ్య ఉన్న అంతరాన్ని కొత్త తరం పసిగట్టింది. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా అంతరించిపోయే దశలో ఉన్న ఆనాటి కళను నేటి యువత తెరపైకి తీసుకొచ్చింది. పలువురు పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌ల ద్వారా అత్తరు పరిశ్రమకు మళ్లీ పురుడుపోశారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పూలను వాడుతూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మట్టి, వాన కురిసేటప్పుడు వచ్చే వాసన తదితర ప్రత్యేక వెరైటీలతో విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగారు. ఐరోపా, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల్లో వీటికి గిరాకీ ఎక్కువ. ఆల్కహాల్ లేకపోవడంతో అరబ్ దేశాల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల ప్రాంతాల్లో పూలు సాగు చేసే రైతులు లాభాల బాటపట్టారు. శీతాకాలం, పెండ్లిళ్ల సీజన్, క్రిస్మస్, రంజాన్ తదితర పర్వదినాల సమయంలో వీటికి డిమాండ్ ఉంటున్నది. 6 ఎంఎల్ అత్తరును 20 డాలర్లకు విక్రయిస్తున్నారంటేనే వీటికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సుగంధ పరిమళాల పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించి వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉన్నది.

**- ఎడిటోరియల్ డెస్క్**

# ఇంటి పనివాళ్ల బాధలు ఇన్నిన్ని కాదు!

**అసంఘటిత రంగంలో పనిచేసే వారిలో ఇంటి పనిచేసే కార్మికులు కూడా ఒక భాగం. ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల్లో చంటిపిల్లల సంరక్షణ, ఇల్లు శుభ్రం చేయడం, వంట పనులు చేస్తూ ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు. సెలవులు, హక్కులు, వసతుల లేమి మధ్యనే కాలం వెళ్లదీస్తుండటం విచారకరం. కనీస వేతన చట్టం, పని గంటలు గూర్చి వీరికి తెలియకపోవడం శోచనీయం.**



ఐ.ప్రసాదరావు
63056 82733

ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల్లో ఇంటి పని చేసేవారికి ఒక్క పనంటూ ఉండదు. ఆయా ఇళ్లల్లో ఉండే ప్రతి పని వారే చక్కబెట్టాల్సి ఉంటుంది. వంట పని, ఇంటి పని, పాత్రలు కడగటం, బట్టలుతకడం, ఇస్త్రీ చేయడం తదితర పనులన్నీ రెక్కలు ముక్కలు చేసుకొని ఒక్కరే చేయాలి. ఇవేకాకుండా ఇంటి కాపలా, పెంపుడు జంతువులు సంరక్షణ, గార్డెనింగ్, వృద్ధులు, అనారోగ్యం పాలైన వారికి సేవలందించడం, డ్రైవర్లు, కిరాణా, కూరగాయలు తేవడం ఇలా పలు పనులు చేసేవారంతా ఈ కోవలోకే వస్తారు.

**ప్రపంచవ్యాప్తంగా 7.6 కోట్ల మంది ఇంటిపని చేసేవారున్నట్టు ప్రపంచ కార్మిక సంఘం (ఐఎల్‌వో) గణాంకాలు చెప్తున్నాయి. మన దేశంలో సుమారు 40 లక్షల మంది ఈ రంగంలో ఉన్నారు. వారిలో 76.2 శాతం మంది మహిళలే.**

ముఖ్యంగా సమాజంలో అట్టడుగు, బడుగు బలహీనవర్గాల మహిళలు ఈ రంగంలో ఎక్కువగా కనిపిస్తారు. ఆందోళనకరమైన విషయం ఏమంటే.. ఈ వృత్తిలోకి బాలికలు కూడా రావడం. పని గంటలతో సంబంధం లేకుండా శ్రమ దోపిడికి గురయ్యేవారికి నెలకు కేవలం రూ.2,000- 4,500 వేతనమే అందుతుండటం విచారకరం.

ఇలాంటి పనిచేసే మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు జరుగుతుండటం ఆందోళనకరం. యజమానులు, యజమాని కుటుంబసభ్యులు ఈ దురాగతాలకు పాల్పడుతున్నారు. పొట్టకూటి కోసం, కుటుంబ అవసరాల కోసం పనిచేస్తు న్నవారిపై అమానుష దాడులు జరుగుతుంటాయి. బయట ప్రపంచానికి తెలియని అకృత్యాలు కోకొల్లలు. యజమానులు, సంస్థలు వారు కూడా మనుషులేనన్న విషయాన్ని గుర్తించాలి. బానిసలు కాదనేది మర్చిపోకూడదు. సమాజంతో పాటు ప్రభుత్వాలు వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. అవసరమైతే వారి కోసం ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టి అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.